సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

దర్జాగా గెడ్డల ఆక్రమణ

- జీవీఎంసీ 25, 26, 44వ వార్డుల్లో గెడ్డ స్థలాల కబ్జా
- బఫర్ జోన్‌లో రోడ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు

సీతంపేట : గెడ్డలు, చెరువులు ఆక్రమిస్తే ఎటువంటి ఉపద్రవాలు సంభవిస్తాయో ఇటీవల విజయవాడలో సంభవించిన వరదలే నిదర్శనం. అయినా ఇటు ప్రజలు, అటు అధికారులు గుణపాఠం నేర్వలేదనే చెప్పాలి. నగరంలో రోజురోజుకీ భూమి ధరలు పెరుగుతుండడంతో కొంతమంది దర్జాగా గెడ్డ స్థలాలు కబ్జా చేసేస్తున్నారు. గెడ్డలను అనుకుని నివాసాలు ఏర్పరచుకున్న వారు, ఇపుడు కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టేటప్పుడు మరికొంత గెడ్డ స్థలాన్ని, బఫర్ జోన్ ప్రాంతాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కళ్ల ముందు గెడ్డ స్థలాలు, బఫర్ జోన్‌లు ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నా నియంత్రించాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.

పైగా క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా ఆన్‌లైన్‌లో ప్లాన్‌లు మంజూరు చేస్తున్నారు. ప్లాన్‌లో అభ్యంతరాలున్నాయని సిబ్బంది షార్ట్‌ఫాల్‌లో పెట్టినా నిర్మాణాలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలు, అధికార యంత్రాంగం మేల్కొనకపోతే గెడ్డ స్థలాలు మరింత కబ్జాకు గురికావడం, భవిష్యత్‌లో వర్షపు నీరు పోయే మార్గం లేక విజయవాడలో సంభవించిన తరహాలో వరద ముప్పును ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాన్‌లో అభ్యంతరాలున్నా...

జీవీఎంసీ 26వ వార్డులో శంకరమఠం రోడ్ ట్రాన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 అడుగుల రోడ్‌లో గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం జరుగుతున్నా, గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి ఇర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ప్లాన్‌లో అభ్యంతరాలు ఉండడంతో జీవీఎంసీ అధికారులు ఆ ప్లాన్‌ను షార్ట్‌ఫాల్‌లో పెట్టారు. షార్ట్‌ఫాల్‌లో ఉన్నప్పుడు ఇంటి నిర్మాణం చేపట్ట కూడదని నిబంధన ఉన్నా స్వేచ్ఛగా నిర్మాణం సాగిస్తున్నారు.


జీవీఎంసీ 26వ వార్డు 80 అడుగుల రోడ్‌లో గెడ్డ పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా..

జీవీఎంసీ 44వ వార్డు 80 అడుగుల రోడ్ గెడ్డ పక్కన 45 – 47 – 31/5 నంబరుతో గతంలో ఉన్న ఇంటి స్థలంలో ప్రస్తుతం కొత్తగా నిర్మాణం చేపడుతున్నారు. గెడ్డ బఫర్ జోన్‌ను, రహదారిలో కొంత భాగాన్ని ఆక్రమించి కొర్మాణం కొనసాగిస్తున్నారు. గెడ్డ రిటైనింగ్ వాల్‌కు ఆనుకుని ఇంటిని నిర్మిస్తున్నారు. గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా జోన్ – 5 టౌన్‌ప్లానింగ్ విభాగం కన్నెత్తి చూడడం లేదు. పైగా మూడంతస్తుల ఇంటి నిర్మాణం కోసం టౌన్‌ప్లానింగ్ అనుమతులు ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించినా... జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు స్పందించడం లేదు.


44వ వార్డులో గెడ్డ స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

వేరే సర్వే నంబర్‌లో నిర్మాణం చేపడుతున్నా...

1994వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సర్వే **నంబరు 40లో 122** గజాల స్థలానికి సంబంధించి **పిన్నింటి పోలమ్మకు** పట్టా ఇచ్చింది. అయితే **పట్టాదారు తనకి** ఇచ్చిన సర్వే నంబరు 40లో **కాకుండా 39/2 స**ర్వే నంబరులో ఇళ్లు నిర్మిస్తున్నారని **అక్కయ్యపాలెం**కు చెందిన గొషియా **బేగం ఇటీవల కలెక్టర్**కు, వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే చేపట్టి నిర్ధారిస్తామని అధికారులు చెప్పి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు చర్యలు శూన్యం. 122 గజాలకు పట్టా ఉండగా సుమారు మరో 60 గజాల గెడ్డ స్థలాన్ని కబ్జా చేసి 200 గజాల్లో ఇంటిని నిర్మిస్తుండటం, గెడ్డ బఫర్ జోన్ కూడా వదలిపెట్టకుండా రిటైనింగ్ వాల్‌పై నిర్మాణం చేపట్టడంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పట్టా సర్వే నంబరు 40లో ఉంటే, 39/2 సర్వే నంబరులో ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, మిషన్ సర్వే చేపట్టాలని గొషియా బేగం కోరుతున్నారు. 80 అడుగుల రోడ్ విస్తరణలో 39/2 సర్వే నంబరులో 450 గజాల స్థలం కోల్పోయామని, పది హేనేళ్లు గడిచినా నష్ట పరిహారం దక్కలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఉన్న కాస్త స్థలం కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని గొషియా బేగం కోరుతున్నారు.


సర్వే నంబరు 39/2లో స్థలం కబ్జా చేశారని మాస్టర్ ప్లాన్ చూపిస్తున్న గొషియా బేగం

గెడ్డ బఫర్ జోన్‌ను రహదారిగా మార్చి...

జీవీఎంసీ 25వ వార్డు పరిధి సీతంపేట మెయిన్ రోడ్‌లో అయ్యంగారి బేకరీ వెనుక గెడ్డ పక్కన బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఆ నిర్మాణానికి సీతంపేట మెయిన్ రోడ్ నుంచి సరైన రహదారి లేదు. దీంతో గెడ్డ పక్కనున్న బఫర్‌జోన్ ప్రాంతాన్ని భవనానికి రహదారిగా మార్చుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సరైన రహదారి లేకపోవడంతో ఏకంగా గెడ్డపై ర్యాంపు నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు. గెడ్డ బఫర్ జోన్‌ను రహదారిగా వినియోగించి నిర్మాణం సాగిస్తున్నా జీవీఎంసీ యంత్రాంగం, రెవెన్యూ విభాగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన రహదారి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


25వ వార్డు సీతంపేటలో గెడ్డ పక్కన నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం


ఆ బహుళ అంతస్తుల భవంతికి గెడ్డ బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన రహదారి

క్లుప్తంగా

జోన్ - 5 ఏపీడీలుగా పుణ్యవతి, కృపానందం


జోనల్ కమిషనర్ రాముతో ఏపీడీలు

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జోన్ – 5 జోనల్ కార్యాలయంలో యూసీడీ విభాగం ఏపీడీలుగా ఉత్తర – పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి పుణ్యవతి, కృపానందం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ బి.రామును మర్యాదపూర్వకంగా కలిసి జాయింట్ లెటర్ అందించి విధుల్లో చేశారు. యూసీడీ విభాగంలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు ఏపీడీలు బాధ్యతగా పని చేయాలని జోనల్ కమిషనర్ రాము సూచించారు.

జోన్ - 3 ఏపీడీగా రాము

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎల్.రాము నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆశీలమెట్ట వద్ద గల జోనల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ గాజువాక యూసీడీ ఏపీడీగా పనిచేస్తూ జోన్ – 3కి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏపీడీగా పనిచేసిన దుర్గాప్రసాద్ గాజువాకకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఏపీడీ రాము మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాముకి యూసీడీ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ జోన్ – 3 పరిధిలోని పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. అర్హులైన మహిళలందరూ పొదుపు సంఘాల్లో చేరేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పొదుపు సంఘాలకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు అందిస్తామని తెలిపారు.

రామకృష్ణానగర్‌లో అన్నసమారాధన


రామకృష్ణానగర్‌లో భక్తులకు వడ్డన చేస్తున్న సత్యనారాయణ

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రజకవీధిలో శ్రీరామదుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోతు సత్యనారాయణ భక్తులకు వడ్డన చేశారు. పరిసర ప్రాంత భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు చిన్నా, వెంకటరావు, ఈశ్వరరావు, సూరిబాబు, అప్పలరాజు, బాబీ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు


కార్పొరేటర్ వెంకటరమణతో వాకర్స్

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు పరిధిలోని మాధవస్వామి ఆలయం పరిసర ప్రాంతాల నుంచి లేన్సమ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్ వరకు చెత్త సోమవారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ మార్గంలో రోజూ ఉదయాన్నే వందలాది మంది వాకింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో చెత్త పేరుకుపోయిందని, వాకింగ్ చేసేందుకు ఇబ్బందిగా ఉందని వాకర్స్ అందరూ కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు సోమవారం వివరించారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి ఒక కిలోమీటర్ మేర చెత్త తీయించి పరిశుభ్రం చేయించారు. దీంతో కార్పొరేటర్‌కు వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వినతులు


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు 13 వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జోన్ – 5 జోనల్ కార్యాలయంలో...

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పలు సమస్యలపై సోమవారం 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 04 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, టౌన్ ప్లానింగ్ టీపీవో విజయకుమార్, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్లు



మురళీనగర్ నివాసితులు వ్యతిరేకిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్లు ఇవే

ధర్నాకు సిద్ధమవుతున్న మురళీనగర్ ప్రజలు

మురళీనగర్ : మురళీనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుపై మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంస్థలు, ఆలయాలకు వంద మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అతిక్రమించి జనావాసాల మధ్య అశోకా బార్ అండ్ రెస్టారెంట్, శ్రీనివాస బార్ అండ్ రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు. దీనిపై మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తోపాటు స్థానికులు నిరసన తెలుపుతున్నారు. 90 మీటర్ల పరిధిలో రామాలయం, జీవీఎంసీ పాఠశాలలున్నాయని... నిత్యం ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. మురళీనగర్ కూడలిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల ఆ ప్రాంతం నిత్యం రద్దీగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు మందుబాబుల హడావిడితో చీకటి పడగానే అటు వైపు మహిళలు ప్రయాణించడానికి భయపడుతున్నారు. బాలికల హాస్టల్, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలకు సమీపంలో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు తొలగించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వీటిని వెంటనే తొలగించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అమర జవాన్లకు ఘన నివాళి

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బేరక్‌లో ఆర్పీఎఫ్ సీనియర్ డివిజినల్ కమిషనర్ ఏపీ దూబే, ఇతర సిబ్బంది కలిసి అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.

- విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ప్లకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు అమరవీరులను తలచుకుంటూ బ్యానర్ ప్రదర్శిస్తున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు

ఫుట్‌పాత్‌లపై నిర్మాణాల తొలగింపు

కంచరపాలెం: జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరావు ఆదేశాల మేరకు టీపీవో విజయకుమార్ పర్యవేక్షణలో సోమవారం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి సబ్‌వే నుంచి ఊర్వశికూడలి వరకు ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడమే కాకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు గోవింద్, సత్తిబాబు నేతృత్వంలో సిబ్బంది నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని ఏసీపీ వెంకటరావు హెచ్చరించారు.


కంచరపాలెంలో ఫుట్‌పాత్‌పై నిర్మాణాలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి

నేటి నుంచి ఆధార్ శిబిరం

మురళీనగర్ : ఆధార్ కార్డుల్లో వివరాల మార్పులు, చేర్పులకు సంబంధించి బృందావన్ పార్కులో మంగళవారం నుంచి ఈ నెల 25 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఆధార్‌కు మొబైల్ నంబరు లింక్, ఈ-మెయిల్ లింక్, బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవచ్చు. పేరు, పుట్టిన తేదీ, చిరునామా మార్పులకు ప్రూఫ్ సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ కావాలంటే పీవోఐ/ పీవోఏ ఒరిజినల్స్ తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 10 సంవత్సరాలకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. సేవా రుసుముగా రూ.50లు చెల్లించాల్సి ఉంటుంది.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పరామర్శ


విష్ణుకుమార్‌రాజును పరామర్శిస్తున్న గంటా శ్రీనివాసరావు

సీతమ్మధార : ప్రమాదవశాత్తు పడిపోవడంతో కాలుకు గాయమైన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం రాత్రి బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతని కాలి గాయాన్ని పరిశీలించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక ప్రమాదం జరిగిన తీరును గంటాకు వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు


విద్యార్థిని అభినందిస్తున్న మధుకుమార్, తదితరులు

సీతంపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 17 వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 20న జరిగిన పోటీల్లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.శ్యామ్ కుమార్ బంగారు పతకాలు సాధించాడు. వెయిట్‌లిఫ్టింగ్ 81 కిలోల విభాగంలో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్ 83 కిలోల విభాగంలో మరో బంగారు పతకం సాధించాడు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు


శాంతిపురం ప్రధాన రహదారిలో వదిలేసిన చెట్ల కొమ్మలు


శాంతిపురం అనుబంధ రహదారిలో వదిలేసిన కొమ్మలు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురం ప్రధాన రహదారితోపాటు, అనుబంధ రహదారుల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది అలానే వదిలేశారు. ఐదు రోజులు గడుస్తున్నా చెట్ల కొమ్మలు మాత్రం తరలించలేదు.

దీంతో ఇళ్ల ముందు, రహదారుల వెంబడి చెట్ల కొమ్మలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కొమ్మలు ఎండిపోయి, రాలిన ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎండిన ఆకులు తడిసి ఇళ్ల ముందు చిత్తడిగా మారిందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే లారీల్లో తరలించేవారని, ప్రస్తుతం తరలింపు విషయంలో జాప్యం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టిడ్కో డిపాజిట్ల వాపస్

సీతమ్మధార : టిడ్కో హౌసింగ్ డిపాజిట్ల వాపస్ కోసం ఆశీలమెట్టలో గల జోన్ – 3 కార్యాలయానికి అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు సోమవారం క్యూ కట్టారు. 2018 – 2019లో టిడ్కో ఇళ్ల కోసం జోన్ – 3 పరిధిలో ఉత్తర, తూర్పు నియోజకవర్గాల నుంచి సుమారు రెండు వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో డిపాజిట్ల కింద రూ.6 కోట్లు చెల్లించారు. పలు కారణాల వల్ల ఇళ్లు రానివారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ముందు రూ.6 లక్షలు వాపస్ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా డిపాజిట్ల వాపస్‌కి బ్రేక్ పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు కొద్ది రోజులుగా టిడ్కో డిపాజిట్లు వాపస్ చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జోన్ – 3కి రూ.75లక్షల నిధులు విడుదల చేసింది. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, డిమాండ్ డ్రాఫ్ట్ జెరాక్స్, ఇతర డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలి. అప్పట్లో దరఖాస్తుదారులు రూ.10 వేలు, రూ.25 వేలు చొప్పున డిపాజిట్లు చెల్లించారు. దరఖాస్తుదారుల వివరాల నమోదు కోసం జోన్ – 3 కార్యాలయానికి సచివాలయాల నుంచి ఇద్దరు వెల్ఫేర్ కార్యదర్శులను కేటాయించారు. వీరు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారులకు బయోమెట్రిక్ విధానంలో ఫొటోలు తీస్తున్నారు. ఈ సందర్భంగా యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము 'సాక్షి'తో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుదారులకు మూడు రోజుల్లో డిపాజిట్లు వాపస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని వివరించారు. దరఖాస్తుదారులు అవసరమైన పత్రాలతో ఆశీలమెట్టలోని జోన్ - 3 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


డిపాజిట్ల వాపస్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

కేవీలో సందడిగా శ్రేష్ట భారత్ ఉత్సవాలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కేంద్రియ విద్యాలయం–2లో ఏక్‌భారత్, శ్రేష్ట భారత్ ఉత్సవాలు –2024ను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీబీఎస్‌ఈ పాఠశాల పర్యవేక్షకుడు సి.వి నరసింహం, దూరదర్శన్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ షఫీ మహ్మద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి శక్తి సామర్థ్యాలను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రేతర స్థాయి నుంచి 8 క్లస్టర్లలో 72 పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన పోటీల్లో తమ ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, లక్ష్మిపాపాయి, రామచంద్రరావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఎట్టకేలకు లైట్లు ఆర్పారు..

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో పగలు కూడా వెలుగుతున్న వీధి లైట్లు ఎట్టకేలకు ఆరాయి. పలు ప్రాంతాల్లో పగలు కూడా వీధిలైట్లు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేయడంతో... ఈ నెల 19న 'పగలే వెన్నెల' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జోన్ – 3 అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వైపు వెళ్లే జాతీయ రహదారిపై సత్యం జంక్షన్, తదితర ప్రాంతాల్లో పగలు కూడా వెలుగుతున్న మోడ్రన్ లైట్లు ఆరేలా సిబ్బంది చర్యలు చేపట్టారు. సాక్షి కథనంతో లైట్లు ఆరడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సత్యం జంక్షన్ వద్ద ఆరిన మోడ్రన్ లైట్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com